నష్టాలబాటలో పత్తి రైతులు



అయిజ శివారులో నీట మునిగిన పత్తి పంట

- అధిక వర్షాలకు దెబ్బతిన్న పత్తి పంట
- గులాబీ రంగు పురుగుతో కుదేలు
- గిట్టుబాటు ధర కోసం ఎదురు చూపులు

అయిజ: వానాకాలంలో కురువాల్సిన వర్షాల కంటే ఎక్కువ వర్షాలు కురవడంతో ఈయేడాది రైతులు సాగుచేసిన పత్తి పంటలు బాగా దెబ్బతిన్నాయి. అధిక వర్షం వల్ల పత్తి పంటకు తెగుళ్లు, పురుగులు ఆశించి దిగుబడి తగ్గింది. గులాబీ రంగు పురుగు పత్తి పంటను ఆశించి దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపించింది. ఎకరానికి సుమారు 20 క్వింటాళ్ల రావాల్సిన పత్తి 5 నుంచి 10 క్వింటాళ్ల మాత్రమే వచ్చింది. దీని వల్ల రైతులు అపారంగా నష్టపోయారు.

దళారులను ఆశ్రయిస్తున్న రైతులు..

మండలంలో సుమారు 59 వేల ఎకరాలు పంట భూములున్నాయి. ఈయేడాది 19,000 ఎకరాల్లో పత్తి పంట సాగు చేస్తారు. పత్తిని చెట్టు నుంచి తొలగించేందుకు కూలీల కొరత ఉంది. ఒక్కో కూలికి రూ.500 నుంచి రూ.600 చెల్లించాల్సి వస్తోంది. మేలు రకం పత్తికి మద్దతు ధర రూ.7521, సాధారణ రకానికి రూ.7121 ప్రభుత్వం ప్రకటించింది.



అధిక వర్షాలకు నాణ్యత కోల్పోయిన పత్తి

అయిజలో కొనుగోలు కేంద్రం లేకపోవడంతో రైతులు దళారులకు పత్తిని విక్రయిస్తున్నారు. దళారులు రూ.6,500 నుంచి రూ.7,000 వరకు కొనుగోలు చేస్తున్నారు.

కష్టాలే మిగిలాయి..



వర్షాకాలం ప్రారంభం నుంచి చివరి వరకు అధిక వర్షాలు కురిశాయి. దాని వల్ల పత్తి మొక్కలు ఎదగలేదు. దానికి తోడు చీడపీడలు ఆశించాయి. కొన్ని కాయలు మురిగిపోయాయి. గులాబీ రంగు పురుగు ఆశించింది. దాని వల్ల దిగుబడి తగ్గిపోయింది. ప్రభుత్వం గిట్టుబాటు ధర ఇవ్వాలి

– నరసింహులు, రైతు, అయిజ

నాలుగేళ్ల నుంచి నష్టాలే..



పత్తి పంటను సాగు చేసే రైతులకు నాలుగు సంవత్సరాల నుంచి నష్టాలే వస్తున్నాయి. అధిక ధరలకు విత్తనాలు కొనుగోలు చేసి సాగుచేసినా సరే దిగుబడి పెరగడంలేదు. ముఖ్యంగా అధిక వర్షాలు కురువడంతో పంటలు దెబ్బతిన్నాయి. ప్రభుత్వమే క్వింటాలు పత్తిని రూ.10 వేలకు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి.

– దేవన్న, రైతు, వేణిసోంపురం

విక్రయించేందుకు జాగ్రత్తలు తీసుకోవాలి



రైతులు పండించిన పత్తిలో నాణ్యతను బట్టి వేరువేరుగా విక్రయించాలి. తేమశాతం ఎక్కువగా ఉన్న పత్తిని ఎండలో ఆరబెట్టుకోవాలి. పత్తిలో చెత్తా చెదారం లేకుండా చూసుకోవాలి. ముఖ్యంగా గొగ్గి (విచ్చుకోని) పత్తిని వేరు చేయాలి. దళారులకు విక్రయిస్తే రైతులు మోసపోతారు. ప్రభుత్వ సీసీఐ కేంద్రాల్లోనే రైతులు పత్తిని విక్రయించుకోవాలి.

– జనార్దన్, మండల వ్యవసాయ అధికారి

క్లుప్తంగా

ఇసుక టిప్పర్ పట్టివేత

గద్వాల క్రైం: అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. ఆదివారం ఉదయం వనపర్తి జిల్లా పావన పురానికి చెందిన ఎల్లస్వామి, రఫీలు బీచుపల్లి శివారులోని డంపు చేసుకున్న ఇసుకను టిప్పర్ ద్వారా ఎర్రవల్లి – గద్వాల మీదుగా తరలిస్తున్నారు. ఈ క్రమంలో పుటాన్‌పల్లి శివారు వద్ద పోలీసులు తనిఖీ చేశారు. అనుమతి పత్రాలు, బిల్లులు చూపించాలని కోరగా, ఎలాంటి పత్రాలు లేవని చెప్పడంతో ఇసుక టిప్పర్‌ను స్టేషన్‌కు తరలించారు. ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వీధిదీపాలు ఏర్పాటు చేయాలి

కేటీదొడ్డి: మండల కేంద్రంలో వీధి దీపాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో ఉన్న పురవీధుల్లో వీధిలైట్లు పూర్తిగా పాడై ప్రజలు వీధుల్లో తిరగాలంటే పాములు, తేళ్ల భయంతో ఆందోళన చెందుతున్నారు. ప్రతి సంవత్సరం దసరాకు ముందు గ్రామంలో విద్యుత్ స్తంభాలకు వీధి దీపాలు బిగించేవారు. ఇప్పుడు పంచాయతీ అధికారులకు తెలిపిన పట్టించుకోవడం లేదని గ్రామస్తులు తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వీధిలైట్లు వేసేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



వనపర్తి రూరల్: పెబ్బేరు పట్టణంలోని మాస్టర్ మైండ్ పాఠశాల విద్యార్థిని మీనాక్షి రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టర్ ఇ రంగారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 2న వనపర్తి జిల్లా కేంద్రంలో బాలకిష్టయ్య క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో విద్యార్థులు గోపి, మీనాక్షి అండర్–16లో 60 మీటర్ల పరుగులో పాల్గొని ద్వితీయ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. మీనాక్షి ఈ నెల 7, 8వ తేదీలలో హనుమకొండలోని జేఎన్ సేడియంలో రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా మీనాక్షిని పాఠశాల యజమాన్యం శాలువాతో సన్మానించింది. పాఠశాల ఉపాధ్యాయ బృందం, పీఈటీ దామోదర్ పాల్గొన్నారు.

పంచాయతీ భవనాలు నిర్మించి.. అప్పుల పాలయ్యాం

కొత్తకోట రూరల్: బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో గ్రామ పంచాయతీ భవనాలు నిర్మించి అప్పుల పాలయ్యామని మాజీ సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్తకోట మండలంలోని 22 గ్రామ పంచాయతీలలో అప్పరాల, రామకృష్ణాపురం, నాచారంపేట, నాటవెళ్లి పెద్దతండా, విలియంకొండ, భూత్‌కూర్, సత్యహళ్లి, పాలెం గ్రామాల్లో కొత్త గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణం కోసం రూ.22లక్షలు మంజూరు చేస్తామని అప్పటి ప్రభుత్వం హామీ ఇచ్చింది. దీంతో ఆయా గ్రామాల సర్పంచ్‌లు అప్పులు చేసి భవనాలు నిర్మించారు. సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసి ఎనిమిది నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ప్రభుత్వం నిధులు రాలేదు. దీంతో అప్పులు తెచ్చిన వారు వడ్డీలు పెరుగుతుండడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డి తమపై దయదలిచి నిధులు మంజూరు చేసి తమను ఆదుకోవాలని మాజీ సర్పంచ్‌లు కోరుతున్నారు.

బాధితుడిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

కొత్తకోట రూరల్: కొత్తకోట పట్టణంలో దినపత్రికలో జర్నలిస్టుగా పని చేస్తున్న శ్రీనివాసులుచారి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఏఐజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఆదివారం ఏఐజీ ఆస్పత్రికి వెళ్లి శ్రీనివాసులుచారిని పరామర్శించారు. ఈ సందర్భంగా మెరుగైన చికిత్స అందించాలని డాక్టర్లకు సూచించారు. మాజీ ఎమ్మెల్యే వెంట జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్ ఉన్నారు.

కారు బోల్తా.. వ్యక్తికి గాయాలు

ఉండవెల్లి: ఎదురుగా వస్తున్న బైక్‌ను తప్పించబోయి కారు బోల్తా పడిన సంఘటన మండలంలోని జాతీయ రహదారి ఉండవెల్లి శివారులో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. వీరాపురం గ్రామానికి చెందిన గోవింద్ పని నిమిత్తం అలంపూర్ వెళ్లి తిరిగి వస్తున్నాడు. ఉండవెల్లి స్టేజ్ సమీపంలో ఆ గ్రామానికి చెందిన బైక్, ఎద్దుల బండి వస్తుండడంతో వాటిని తప్పించబోయి కారు బోల్తా పడింది. దీంతో కారులో ఉన్న గోవిందుకు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే హైవే సిబ్బంది అంబులెన్స్‌లో వైద్యం చేశారు.

ప్రమాదమని తెలిసినా.. పట్టించుకోరా?

శాంతినగర్: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మంటలు వస్తూ ప్రమాదమని తెలిసినా విద్యుత్‌శాఖ అధికారులు పట్టించుకోవడంలేదని పైపాడు ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వడ్డేపల్లి పురపాలిక పరిధిలోని పైపాడులోని సుంకులమ్మ ఆలయ సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎర్త్‌వైర్‌కు కరెంట్ సరఫరా అవుతూ మంటలు వస్తున్నాయి. ఎవరైనా అటువైపు వెళ్తే ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఉంది. ఈ విషయం విద్యుత్‌శాఖ లైన్‌మేన్‌కు సమాచారం ఇచ్చినా పట్టించుకోవడంలేదని పైపాడు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించి ప్రజలు, జీవాలు ప్రమాదాల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు



పైపాడు సుంకులమ్మ గుడి సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్‌ల వద్ద మంటలు

తొమ్మిదోసారి యూనియన్ ప్రధాన కార్యదర్శిగా..

గద్వాల: లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ గద్వాల బ్రాంచ్ ప్రధాన కార్యదర్శిగా రంగారావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం గద్వాల ఎల్ఐసీ బ్రాంచ్‌లో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో రంగారావును తొమ్మిదో సారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా యూనియన్ సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో శ్రీనివాసన్, మద్దిలేటి, గిరిధర్, యాదగిరి, నర్సింహ, గోపాల్, మురళీకృష్ణ, రాజ, వెంకటేష్, కృష్ణారెడ్డి, బసవేశ్వర్, కరుణాకర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



గద్వాల బ్రాంచ్ కార్యదర్శిగా ఎన్నికైన రంగారావును సన్మానిస్తున్న సభ్యులు

సూచిక బోర్డులు ఏర్పాటు చేయండి

రాజోళి: మండలంలోని ఆయా గ్రామాల్లో మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఆ ములపుల వల్ల ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు సంభవిస్తున్నాయి. మలుపులను ఆనుకునే ఇళ్లు కూడా ఉండటంతో చిన్న పిల్లలు, వృద్ధులకు ప్రమాదాలు జరిగే అవకాశముంది. మలుపుల దగ్గర సూచిక బోర్డులు, అద్దాలను ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాలకు వెళ్లే వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.



మాన్‌దొడ్డిలో ప్రమాదకరంగా ఉన్న మలుపు

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం చెక్కును అందజేస్తున్న మిత్రబృందం

పాన్‌గల్: మండలంలోని రేమద్దులకు చెందిన కుర్మయ్య కుటుంబానికి తమ వంతు సాయంగా 2000–2001 పదో తరగతి మిత్రులు రూ.50 వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు నెలల క్రితం కుర్మయ్య అనారోగ్యంతో మృతి చెందాడని, దీంతో బాధిత కుటుంబాన్ని ఆదుకునేందుకు గురుకుల పాఠశాల లింగాలలో చదువుకున్న తోటి మిత్ర బృందం హెల్పింగ్ హ్యాండ్స్ అసోసియేషన్ ద్వారా పోగు చేసిన నగదును కుటుంబానికి అందజేసినట్లు తెలిపారు. బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని మిత్ర బృందం భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో శాలయ్య, కుమార్, శ్రీబాబు, గిరిబాబు, సహదేవ్, రాజేందర్, తిరుపతయ్య పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ధరూరు ఉన్నత పాఠశాల 2009 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు

ధరూరు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2009 సంవత్సరం పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. 15 ఏళ్ల క్రితం చదువు బోధించిన గురువులను ఆహ్వానించి ఘనంగా సన్మానించారు.

ఘనంగా వడ్డెర ఓబన్న వర్ధంతి



అయిజ: మండల కేంద్రంలో ఆదివారం స్వాతంత్ర్య సమర యోధుడు వడ్డెర ఓబన్న వర్ధంతి ఆదివారం అఖిలపక్ష కమిటీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా అఖిలపక్ష కమిటీ అధ్యక్షులు ఆంజనేయులు మాట్లాడారు. కార్యక్రమంలో అఖిలపక్ష కమిటీ నాయకులు వెంకట్రాములు, మద్దిలేటి, పల్లయ్య, కృష్ణ, ఆంజనేయులు, నరసింహులు, తిమ్మప్ప, రాము తదితరులు పాల్గొన్నారు.

9న కలెక్టరేట్ ముట్టడి



ధరూరు: ఈ నెల 9న కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకులు డ్యాం వెంకటన్న, నీలహళ్లి చరణ్‌లు తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. మండలంలో దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎంఆర్‌పీఎస్ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ముట్టడి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు, దళితులు, విద్యార్థులు, మేధావులు అధిక సంఖ్యలో తరలి వచ్చి ముట్టడి, నిరసన ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు రాములు, రంగస్వామి, కురుమన్న, నర్సింహులు, కోటన్న పాల్గొన్నారు.

కల్మశం లేకుండా జీవించాలి



ధరూరు: ప్రతి ఒక్కరూ కల్మశం లేకుండా జీవించాలని పాస్టర్ సీపీ యూదా ప్రసాద్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఎంబీ షాలేం చర్చిలో మొదటి ఆదివారం బల్లారాధన ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సర్వలోక సృష్టికర్త అయిన ఏసుక్రీస్తును పోలిన జీవితాన్ని కలిగి ఉండాలన్నారు. సమాజంలో యువత అనేక రుగ్మతలకు లోనవుతోందని, యువకులు సన్మార్గంలో నడవాలని కోరారు. అనంతరం సహ పంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

గద్వాల క్రైం: రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. రూరల్ ఎస్ఐ శ్రీకాంత్ వివరాల ప్రకారం.. గద్వాల పట్టణానికి చెందిన శివ, రాము, చందులు తుర్కోనిపల్లిలో రేషన్ కార్డుల లబ్ధిదారుల నుంచి 60 బస్తాల రేషన్ బియ్యం సేకరించారు. ఆదివారం తెల్లవారుజామున బొలెరా గూడ్స్ వాహనంలో తరలిస్తున్నారు. ఈ క్రమంలో సిబ్బంది తనిఖీ చేసి గూడ్స్ వాహనాన్ని పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



అయిజలో కాళికాదేవి ఆలయంలో అన్నపూర్ణేశ్వరి దేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు



అన్నపూర్ణాదేవి అలంకరణలో శాంతినగర్ వాసవి కన్యకాపరమేశ్వరిదేవి



గట్టులో లలితాత్రిపురసందరీ దేవిగా దర్శనమిచ్చిన భవాని మాత

అన్నపూర్ణేశ్వరిదేవిగా అమ్మవారు



శాంతినగర్‌లో అన్నపూర్ణాదేవికి కుంకుమార్చన పూజలు నిర్వహిస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు

- రాజోళి, గట్టు, ధరూర్‌లో లలితాదేవీ రూపంలో..
- మండపాల వద్ద భక్తులకు అన్నదానం

సాక్షి, నెట్‌వర్క్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆయా మండలాల్లో దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయిజ, శాంతినగర్, బీచుపల్లిలో దుర్గామాతను అన్నపూర్వేశ్వరి దేవీగా అలంకరించి పూజలు చేశారు.

అయిజలో కాళికాదేవి ఆలయంలో అన్నపూర్ణేశ్వరి దేవిగా, వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో గాయత్రి దేవీగా దర్శనమిచ్చారు. కట్టకింది తిమ్మప్ప స్వామి ఆలయంలో వేంకటేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాన్ని భక్తులు అశ్వ వాహనంపై ఊరేగించారు. రాజోళి, గట్టు, ధరూర్, ఎర్రవల్లి, ఉండవెల్లి, కంచుపాడు మండలాల్లో లలితాదేవిగా అమ్మవారు పూజలందుకున్నారు. ఆయా మండపాల వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.



రాజోళిలో అమ్మవారికి పూజలు చేస్తున్న మహిళలు



ఉండవెల్లిలోని గాంధీనగర్‌లో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు



శాకాంబరి దేవి అలంకరణలో అమ్మవారు



బీచుపల్లిలో అన్నపూర్ణాదేవిగా దర్శనం



ఎర్రవల్లిలో లలితా త్రిపుర సుందరిదేవి అలంకరణలో దుర్గామాత

పేదలకు ఉపయోగకరంగా సీఎంఆర్ఎఫ్

గద్వాల: పేదలకు మెరుగైన వైద్యం కోసం సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కేటీదొడ్డి మండలం నందిన్నె గ్రామానికి చెందిన నర్సింహారెడ్డి, మల్దకల్ మండలం పాల్వాయి గ్రామానికి చెందిన జనార్దన్, గద్వాల పట్టణం జమ్మిచేడుకు చెందిన రమణమ్మలకు సీఎం రిలీఫ్‌ఫండు చెక్కులు అందజేశారు.



సీఎం రిలీఫ్ ఫండు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

కాంగ్రెస్ జిల్లా మహిళా జనరల్ సెక్రటరీగా రాధమ్మ



ఎర్రవల్లి: కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా జనరల్ సెక్రటరీగా ఆదివారం ఎర్రవల్లి మండల కేంద్రానికి చెందిన రాధమ్మ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అలంపూర్‌లో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు నియామక పత్రం అందజేసినట్లు ఆమె తెలిపారు. తనపై నమ్మకంతో అవకాశం కల్పించడంతో పార్టీ కోసం తన వంతు కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు.

రెండు ట్రాక్టర్లు స్వాధీనం

రాజాపూర్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఆదివారం స్వాధీనం చేసుకుని కేసునమోదు చేసినట్లు ఎస్ఐ రవి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పెట్రోలింగ్ చేస్తుండగా కుచ్చర్‌కల్ శివారులోని దుందుభీ వాగులో ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం అందింది. దీంతో వారు వెళ్లి ఇసుక ట్రాక్టర్‌ను అడ్డగించారు. ఎలాంటి పత్రాలు లేకపోవడంతో ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గెలుపోటములు సమానంగా చూడాలి



కొత్తకోట: క్రీడాకారులు గెలుపు ఓటములను సమానంగా చూడాలని కొత్తకోట సీఐ రాంబాబు అన్నారు. దసరా పండుగ సందర్భంగా ఆరోగ్య క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం క్రికెట్ టోర్నమెంట్స్ ఏర్పాటు చేశారు. క్రికెట్ పోటీలను సీఐ రాంబాబు ప్రారంభించి మాట్లాడారు. ప్రతి క్రీడాకారుడు క్రీడా స్ఫూర్తితో ఆడి టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలన్నారు. వాకింగ్ క్లబ్, క్రికెట్ క్లబ్‌ల ద్వారా అందరికీ ఆరోగ్యం పంచుతూ చక్కని గుర్తింపు పొందిన క్లబ్ సభ్యులను ఈ సందర్భంగా సీఐ అభినందించారు. క్రీడలను స్నేహపూరిత వాతావరణంలో కొనసాగించాలని నిర్వాహకులు శంకర్‌గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య వాకింగ్ క్లబ్ నిర్వాహకులు శేఖర్‌గౌడ్, అధ్యక్షులు లక్ష్మీరెడ్డి, సభ్యులు గుంత శివ, రామకృష్ణ, రవిందర్‌రెడ్డి, బాలకృష్ణ, నవీన్, కృష్ణ, రవికుమార్ ఉన్నారు.